# మళ్ళీ వినిపిస్తున్న తెలుగు పద్యం

*బచ్చోటి శ్రీధరరావు*

ఈ మధ్య ఏవో సందర్భాలలో మన తెలుగు పద్యాలు మళ్ళీ మనకి వినపడుతున్నాయి. వినపడడమే కాక ఎంతో ఆదరణకు కూడా నోచుకుంటున్నాయి. ఒకప్రక్క అష్టావధానాలూ, శతసహస్రావధానాలూ, మరొకప్రక్క పద్యభూయిష్టమైన నాటకప్రదర్శనలూ అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఇది ఎంతో ఆనందదాయకమైన విషయం. ఎందుకంటే చాలాకాలంగా మన మాతృభాషలోరచించబడి, రచించబడుతున్న మన తెలుగు పద్యాలు యెవరి ఆదరణనూ నోచుకోకపోవడమే కాక యెంతో అపహాస్యానికి గురి అయిన సందర్భాలూ ఉన్నాయి. ఆ తిరస్కారాలూ వాదనలూ అలానే ఉన్నా చక్కని పద్యాలను వినాలనీ, విని ఆనందించాలనీ తెలుగు వారి మనసులలో ప్రస్ఫుటమైన కోరిక ఇంకా అలానే ఉంది. ఈ కోరికవల్లనే, ఆంధ్రరాష్ట్రంలో కానీ, యీ ఉత్తర అమెరికా లో కానీ యెన్నో తెలుగుపద్య సంబంధమైన కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి అంటే అది మన పద్యమంటే ఎందరికో ఉన్న అభిమానం వల్లనే. అలాంటి యెందరో సాహితీప్రియులవల్లనే మన పద్యసాహిత్యానికి యెప్పటినుంచో ఉన్న గౌరవం అలానే నిలబడి ఉంటోంది. కొత్త గౌరవం దక్కుతోంది. చక్కని పద్యాలను రాగయుక్తంగా పాడితే వినాలనీ, తాము కూడా పాడాలనీ ఎందరో ఉవ్విళ్ళూరుతుండడం మనం చూస్తూనే ఉంటాము.



సవ్యసాచుల్లాగా ఒకప్రక్క పద్యకవిత్వాన్నీ వేరొకప్రక్క వచనకవిత్వాన్నీ రెండింటినీ సమదృష్టితో చూచి ఆస్వాదించగల రసదృష్టి తెలుగు వారికి ఉంది. ఏ కళారూపమైనా ఇంకొక కళారూపాన్ని బహిష్కరించదు. ఏ కవితాప్రక్రియ ఐనా ఇంకొక కవితాప్రక్రియను బహిష్కరించవలసిన అవసరం లేదు. ఏదైనా ఒక కళ వెనకపడితే దానికి కారణాలు చాలా రకాలుగా ఉంటాయి. కళలోని

బలహీనత వల్ల మాత్రమే కాదు. ఎందుకంటే బలహీనమైన ప్రక్రియ అసలు ఒక కళగా కొద్ది కాలమైనా నిలబడడమే కష్టం. పదికాలాలపాటు అందరి మన్ననలూ అందుకున్న కళ వెనకపడితే అలా ఎందుకు జరిగిందో నిష్పాక్షికమైన దృష్టితో పరిశోధించవలసి ఉంది కానీ కళ ఎందుకూ పనికి రాదని కొట్టిపారెయ్యడం సబబు కాదు .

## *తెలుగు వారికి భాషాభిరుచి లేదా?*

చాలామంది అంటూంటారు. సాహితీసదస్సులన్నా, కవితావ్యాసంగాలన్నా తెలుగు వారికి ఏమీ అభిరుచి లేదనీ, అటువంటి సభలకి రారనీ, మొదటిరోజు సినిమాహాలులో కనపడినట్లుగా క్రిక్కిరిసిన జనం, కనీసం నాట్యం, నాటకం లాంటి రంగస్థలప్రదర్శనలలో కనిపించేపాటి జనం ఒక కవిసమ్మేళనంలో కానీ అష్టావధానంలో కానీ కనిపించరనీ. ఇది పూర్తిగా నిజం కాదు. . మనసును ఉల్లాసపరిచే (మేధస్సుకు పనిపెట్టని) కార్యక్రమాలూ, మేధస్సుకు పరీక్షపెట్టే కార్యక్రమాలూ ఒకేవిధంగా అందరినీ ఆకర్షించాలనుకుంటే ఎలా? ఇందులో రెండవ తరగతి కార్యక్రమాలకు ఆదరణ యెంత పెరిగితే అంత ఆనందం. మొదటి తరగతి కార్యక్రమాలకు ఆదరణ లేకపోతేనే ఆశ్చర్యం. ఈ రెంటినీ సమన్వయపరచి ఒకేసమయంలో ప్రేక్షకులను అలరించిన కార్యక్రమాలూ ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకి అమెరికాలో సిలికానాంధ్ర వారు కవితాగోష్ఠులకు విడియో టెక్నాలజీ జోడించి వేలాది ప్రేక్షకులను ఆకట్టుకోగలిగారు. అలాగే ఈ మధ్యకాలంలో ప్రేక్షకులను ఆనందింపజేసి విశేషంగా అందరి అభిమానాన్నీ పొందిన కార్యక్రమం ఆకెళ్ళ వెంకటసూర్యనారాయణగారు రచించిన "శ్రీనాధుడు" పద్యనాటిక. అటువంటి నాటికలవల్ల ఉత్తేజితమై కానీ సహజంగా గానీ అదేరీతిలో ఉత్తర అమెరికాలోని తెలుగు సాంస్కృతిక సమితులలో ప్రదర్శింపబడుతున్న కొన్ని పద్యనాటికలూ తెలుగుప్రజలకి తెలుగుపద్యమంటే ఉన్న అభిమానాన్ని అద్దం పట్టి చూపేవే. సిలికానాంధ్ర వారే గత అక్టోబర్ లో ప్రదర్శించిన 'ఇంద్ర సభ' ఈ కోవకు చెందిందే!

అయినా తెలుగుపద్యమంటే గతంలో ఉన్న అభిమానం ఇప్పుడు యెవరికీ లేదనీ ఇంక పద్యాలు యెవరూ వ్రాయకూడదనీకూడా ఎక్కడన్నా ఎవరన్నా అనడం వినబడుతూ ఉంటుంది.

మన పద్యాలకు ఆదరణ యెందుకు తగ్గిందని కాకుండా ఎన్ని అడ్డంకులు వచ్చినా తట్టుకుని నిలబడి తెలుగుపద్యం కొంతమంది కైనా ఎలా ఆనందాన్ని కలిగిస్తోందో, కొన్ని వందల సంవత్సరాల క్రితం వ్రాయబడిన పద్యాలు కూడా ఇంకా ఎంతోమంది జిహ్వాగ్రాలపై ఎలా నడయాడుతూ ఉన్నాయో కొంచెం ఆలోచిస్తే ఆ పద్యాలలో ఉన్న అర్థం, మాధుర్యం అవగతమౌతుంది. అర్థం పర్థం లేని అవకతవక పద్యాలను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎవరికీ లేదు. కాబట్టి అందరి మనసులలో నిలవడానికి కావలసింది అర్థమూ, భావమూ, కవిత్వమూ అన్నీ. అయితే పద్యం పూర్తిగా అక్షరం పొల్లు పోకుండా గుర్తుండడానికీ, కొంతమందికి వరసగా కొన్ని పదులూ వందలూ కూడా పద్యాలు గుర్తుండిపోవడానికిగల ముఖ్యమైన రెండో కారణం పద్యాలలో ఉన్న నడక, తూగు, లయ, పదవిన్యాసం.

సంగీతంలో రాగభావాలకి సమప్రాధాన్యమున్నట్లుగా మన పద్యాల్లోనూ భావానికీ ఛందస్సుకూ సమప్రాధాన్యం ఉంది. అందుకే పద్యాలని చదివేటప్పుడు భావాన్నీ నడకనూ కూడా మనం సమంగా ఆస్వాదిస్తాం. ఈ విషయం చాలా వచనకవితలకు కూడా వర్తిస్తుంది. ఏ మాత్రానుసరణమూ, నడకా లేని కవిత్వంలో అర్థాన్ని మాత్రమే మనం ఆస్వాదిస్తాం. కేవలం అర్థప్రాధాన్యంతో ఉత్తమకవితను అందించడం అసాధ్యం కాదు. అనంతమైన లోతైన భావం తో కవిత్వంతో మనల్ని కట్టుకున్న అర్థాలంబనాలయిన వచనకవితలు మన సాహిత్యంలో ఎన్నో ఉన్నాయి. అయినా ఛందోబద్ధమైన కవిత కానీ, మాత్రానుగతమైన కవిత కానీ చదువరికి కొంత సౌకర్యాన్ని చేకూరుస్తుంది కానీ అవరోధాన్ని కలిగించదు.

## *కష్టమైన పదాలు*

మనపద్యాలలో కష్టతరమైన పదాలు యెక్కువై అర్థం కావని ఒక భావన. అర్థం పూర్తిగా సుగమం కాకపోయినా పద్యంలో నిబిడీకృతమైన లయ వల్ల పద్యాలను యెందరో గడగడా చదివెయ్యగలుగుతారు. అప్పజెప్పెయ్యగలుగుతారు. అందులోనే ఒకవిధమైన ఆనందాన్ని పొందగలుగుతారు. కానీ అక్కడతో ఆగకుండా కొద్దిపాటి భాషాపరిశ్రమ చేసి అర్థం తెలుసుకొన్న తరువాత అదే పద్యం రెట్టింపు ఆనందాన్ని ఇస్తుంది . భాషాపరిశ్రమ అన్నది

కవితారసాస్వాదన కోసమే కాక వేరే విధాలుగానూ మనకు ఉపయోగపడుతుంది. మన భాషలోని సంపదనీ, లోతునీ, పదజాలాన్నీ మనం యెంతగా అవగాహన చేసుకొంటే మనకు అంత సంతృప్తి కలుగుతుంది. మన భాషకీ యెంతో మేలు కలుగుతుంది. అంతే కానీ కష్టమైన పదాలు అర్థం కావనీ, అవి అక్కర లేదనీ, కాల్రకమేణా  ఆ పదాలు అదృశ్యమైపోవాలనీ కోరుకోవడం మన మాతృభాషకి అన్యాయం చెయ్యడమే అవుతుంది. అలాగే నిజంగా జరిగితే మన తెలుగు భాషలోని శక్తి అంతా  కొంత కాలానికి యిగిరిపోయి, నిత్యావసరాలకు కావలసిన ఏ నాలుగు పదాలో మాత్రమే మిగిలి చివరకు ఒకరోజున అనంతమైన కవితాభావాలను వెలువరించడానికి ఏ మాత్రం సరిపోని దైనందినభాషగా మిగులుతుంది. పటుత్వమైన భాష, పదజాలం ఏ రచనాప్రక్రియకైనా మేలు చేస్తుంది కానీ కీడు చేయదు.

తెలుగు పద్యకవితను ఆస్వాదించాలంటే కష్టతరమైన పద్యాలే అక్కర్లేదు. తేలిక పదాలతో కూడా ఎంతో ఉదాత్తమైన భావంతో మన గుండెలపై చెరగని ముద్ర వేసే పద్యాలు మన సాహిత్యంలో కోకొల్లలు. ' నేనొక పూలమొక్క కడ నిల్చి..'  అన్న పుష్పవిలాపపద్యాన్ని మననం చేసుకొని మెచ్చుకోలేనివారెవరు? అలాగే సంస్కృతపదభూయిష్టమైన పద్యాలు కూడా అర్థం తెలుసుకొన్న తరువాత యెంతో ఆనందాన్నిస్తాయి. పిండి కొద్దీ రొట్టె. శ్రమకొద్దీ ఫలితం. ప్రపంచంలో యే కళ అయినా శాస్త్రమైనా అంతే కదా?

## *సాహిత్యం - సగటుమనిషి*

మరి శ్రమపడడానికిష్టపడని  సగటుమనిషి  సంగతేమిటి ? కవిత్వం సగటుమనిషికి అందుబాటులో ఉండాలి కానీ ఇలా కష్టంగా ఉండకూడదు అని ఒక వాదన. అభివృద్ధినిరోధకమైన వాదన యిది. కవిత్వం రకరకాలుగా ఉంటుంది. తేలికగా సగటుమనిషికి అర్థమయే కవిత్వమూ ఉంటుంది, కష్టంగా ఉండే కవిత్వమూ ఉంటుంది. ఎవరికి కావలసింది వారు యెంచుకోవచ్చు. కష్టమైన భాష అర్థం కాని వారికి ఇంకొంత  భాషాపరిశ్రమ చేయమని ప్రోత్సహిస్తే, వారికీ దేశానికీ కూడా ప్రయోజనం. అంతే కానీ సగటుమనిషికి అర్థం కాదు కాబట్టి ఉత్తమసాహిత్యాన్నే వదులుకోమనడం ఏం న్యాయం? అయినా సగటుమనిషిని మరీ అంత

తక్కువగా అంచనా వేయడం కూడా న్యాయం కాదు. ప్రాథమిక విద్యకు కూడా నోచుకోని ఎందరో తిరుపతి వేంకట కవులు, జాషువా మొదలైన వారి పద్యాలు రాగయుక్తంగా పాడుకోవడం మనకి తెలుసు. ఒకవేళ సదరు సగటుమనిషి ఒక ఉదయాన్నే లేచి నాకసలు ఏ కవిత్వమూ వద్దంటే మరి అప్పుడు మన సాహిత్యం పరిస్థితి యేమిటి? సాహిత్యం విలువలు పెంపొందించడానికి ప్రయత్నించాలి గానీ సాహితీపతనయుగానికి నాంది పలికితే యెలా?

*అది సంస్కృతమా? తెలుగా?*

సంస్కృతపదాల గురించి ప్రస్తావించాను కనుక ఒక చిన్న మాట చెప్పాలి. చాలామంది మన పద్యాలలో కనపడినప్పుడు గానీ విడిగా గానీ సంస్కృతపదాలను అదేదో వేరే భాషగా చూస్తారు. కానీ అది వేరే భాష కాదు. మనభాషలో ఒదిగిపోయి మన భాషే అయిపోయినవి సంస్కృతపదాలు. తెలుగులో ఉపయోగింపబడినప్పుడు అవి తెలుగు పదాలే. సంస్కృతపదాలు కావు. పెద్ద పెద్ద సమాసాలు కూడా తెలుగు పదాలే అవుతాయి. ఎందుకంటే ఎంత పెద్ద సమాసమైనా అది ఒక పదం క్రిందే లెక్క. (సమర్థంబులగు పదంబులేకపదంబగుట సమాసంబనంబడు - చిన్నయ సూరి). విడి విడి పదాలకు అర్థం తెలిస్తే యెంత పెద్ద సమాసమైనా సులభంగా అర్థమైపోతుంది. పదములు మాత్రమే కాకుండా సంస్కృతవాక్యాలని ఉపయోగించుకుంటే అది తెలుగు కాదు. సంస్కృతమే. భాష యొక్క నిశ్చయస్వరూపం విడివిడి పదాలలో కాక వాక్యనిర్మాణంలో ఉంటుంది. మన పద్యాలలో సంస్కృతవాక్యాలను వాడడం ఎక్కడో ఒక నిర్దిష్టమైన ప్రయోజనం కోసం తప్ప జరగదు.

ఏ విధమైన కవితా రచనని చదివి ఆనందించేవారైనా ఈ కష్టాలు మేం ఎందుకు పడాలి అని అనరు. ఎందుకంటే ఎంతటి సులభమైన వచన కవిత ఐనా, పద్యకవిత ఐనా మన దైనందిన సంభాషణలా కాక ఒక వైవిధ్యమైన స్థితిలో ఉంటుంది. కవితని చదివి, విని ఆనందించే వారికి భాషపై అభిమానం ఉంటుంది. ఆ అభిమానం వల్ల వారు ఇంకొంత భాషా సౌరభాన్ని సౌరభంగానే భావించి ఆహ్వానిస్తారు కానీ హేయమైన దుర్గంధంగా భావించి కించపరచరు.

## కవిత్వమా? ఛందస్సా?

పద్యంలో విషయం, కవిత్వం ఉండాలి, ఛందస్సు కాదు అని ఒక అభిమతం. విషయం, కవిత్వం పద్యకవితలోనే కాక ఏ కవితలోనైనా ఉండాలి. మంచి కవిత్వం కాకపోతే పద్యం ఎవరికీ నచ్చదు. వచనకవిత అయినా నచ్చదు. ఛందస్సు అక్కర్లేదు అంటే అది ఒక విషయం. ఛందస్సు ఉండకూడదు అంటే అది వేరే విషయం. ఈ రెండవ మాట అనేవారు మన పురాణప్రబంధాదికవిత్వాలని ఎంతో తూలనాడే స్థితికి వెళ్ళిపోయారు. అయితే ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే ప్రేక్షకులు మాత్రం పద్యరసాస్వాదనకి ఎంతో కొంత సిద్ధంగానే ఉన్నారు. కవులు కానీ పత్రికలు కానీ వాళ్ళ ముందు పద్యకవితలు ఉంచకపోతే లభ్యమైన కవితలనే చదువుతారు.

## అవి వ్యర్థపదాలా?



మన పద్యసాహిత్యాన్ని చదవడానికీ భాషని పెంపొందించుకోవడానికీ చదువరులను ప్రోత్సహించేందుకు బదులు వారిని అనేకరకాలుగా పద్యసాహిత్యాన్నుంచి విముఖుల్ని చేసే వాదనలు వచ్చాయి. వాటిలో ఒకటి మన ప్రాచీనపద్యాలలో అనవసరమైన పదాలు చోటుచేసుకున్నాయని. అంటే ఉదాహరణకి ‘గ్రహించిచూడగా‘, ‘వింటే‘, ‘చెప్పగా‘ అని పద్యం చివరలో వచ్చే మాటలు. ఈ వాదం కొండను త్రవ్వి యెలుకను పట్టడం వంటిది. ఎందుకంటే అటువంటి పదాలు లేని పద్యాలు మన సాహిత్యంలో వేలాదిగా ఉన్నాయి. వాటిని మెచ్చుకోవడానికి కూడా యీ విమర్శకులకు మనస్కరించదు. మన కావ్యాలు, పురాణాలు వ్రాసిన భాషావేత్తలైన కవులకు ఆ పదాలు లేకుండా పద్యం వ్రాయడం యేమాత్రం కష్టం కాదు. ఆ రచనా పద్ధతిలో ఒక శైలిని వారు చూశారు. కాబట్టి వ్రాశారు. ఇప్పుడు పద్యాలు వ్రాసేవారు కూడా పద్యాన్ని తామనుకున్న విధంగా వ్రాయగలరు. ఒకవేళ యెవరైనా వ్రాయలేకపోతే వారు కవులుగా స్థిరపడడానికి

యింకొంత  సాధన చేయవలసి ఉంది. అంతే కానీ తప్పు పద్యంలో లేదు.

*అవధానంలో కవిత్వం*

అవధానకార్యక్రమం గురించి ఒక్కమాట. చాలామంది అవధానపద్యాలలో అద్భుతమైన కవిత్వం లేదని ఆరోపిస్తూ ఉంటారు. అలా అనే వారికి అవధానమంటే సరైన అవగాహన ఉండడం అవసరం. అవధానం చెయ్యడం వేరు. కవిత్వం చెప్పడం వేరు. ఈ రెండిటికీ ఉన్న సామాన్యగుణం పద్యమే ఐనా ప్రేక్షకులకు ఆహ్లాదం కలిగించడానికి చేసే భాషాసంబంధమైన సర్కసు అవధానం. దాని ప్రయోజనం దానిది. అక్కడ ఎప్పుడో తప్ప అద్భుతమైన పద్యాలు వెలువడవు. అది సహజమే. అవధానంలో కావాలనే మంచి కవిత్వానికి రకరకాలుగా అడ్డంకులు మనమే పృచ్ఛకుల రూపంలో కలిగిస్తూ ఉంటాము. అప్రస్తుతప్రసంగమే కాక దత్తపదులూ,



నిషిద్ధాక్షరులూ అన్నీ అలాంటివే. మరి మంచి కవిత్వం లేదంటే యెలా? కవిత్వంతో సంబంధం లేని  గంటలు లెక్కపెట్టడం ఎందుకు,  తేదీలు వారాలు చెప్పడం ఎందుకు అనం కదా? అవధానికి పరమావధి ఆ సర్కసు సరిగ్గా చేయడమే. కవిత్వంతో మెప్పించడం కాదు. దానికి కావాలంటే వేరే వేదికలు, సాధనాలు ఉంటాయి. మంచి కవిత్వం సంగతి అలా ఉంచి, ఎంతో భాషాపరిశ్రమ, సాహిత్యాభిలాష, పరిజ్ఞానమూ, ప్రతిభా ఉంటే తప్ప చేయలేని ఈ అవధానకార్యక్రమాలకు ఉన్న ఆదరణ చూస్తే తెలుగు వారికి ఉన్న భాషాభిరుచి స్పష్టమౌతుంది.

*కవిత్వంలో సామాజికప్రయోజనం*

కవిత్వంలో సామాజికప్రయోజనం గురించీ, పద్యకవితలో  సామాజికప్రయోజనం లేకపోవడం గురించీ చాలానే చర్చలు జరిగాయి. కానీ సామాజికస్పృహతో ప్రయోజనం కోసం వ్రాసిన పద్యకవితలు మన సాహిత్యంలో లేక పోలేదు. అసలు పద్యానికి విశేషమైన ఆదరణ అంటూ లభిస్తే అన్ని విధాలైన  కవితలూ వాటంతటవే పుట్టుకొస్తాయి. పద్యకవితకీ వచనకవితకీ కూడా సంబంధించి ఒక విషయం గుర్తుంచుకోవాలి. సామాజికప్రయోజనం, సాహిత్యం రెండు విషయాలు. సామాజిక ప్రయోజనం సాధించడానికి సాహిత్యం  ఒక్కటే ఆధారం కాదు.

సాహిత్యానికి సామాజికప్రయోజనమే కాక వేరే ప్రయోజనాలూ ఉన్నాయి. ఆ వేరే ప్రయోజనాలకి సాహిత్యం ఉపయోగపడకుండా ఎప్పటికీ ఉండదు. బహుముఖశక్తిమంతమైన సాహిత్యాన్ని కుంచించి కుంచించి ఏకోన్ముఖంగా ఉంచాలనుకోవడం సాహిత్యసేవ కాదు.

ఏ కళలోనైనా కళను సాధన చేసి దానిని ప్రజల ముందుంచేవారొకరు ( కళాకారులు, కవులు, రచయితలు). కళను చూసి, విని, చదివి ఆనందించే వారొకరు (ప్రేక్షకులు, చదువరులు). ఇదివరకు చెప్పినట్లు చూడగానే మనసును ఆహ్లాదపరచే కళలకు ప్రేక్షకులెక్కువ. మేధోసంబంధమైన కళలకు (కవిత్వం, సంప్రదాయ సంగీతం వంటివి) ప్రేక్షకులు తక్కువ. కానీ తక్కువైనా ప్రేక్షకులు ఎప్పుడూ ఉండనే ఉంటారు. అయితే ఈ రెండవ తరగతి కళలను ఆదరించడానికి ముందుకు రాని వారు వారి అభిరుచి ఆ దిశలో పెంపొందించుకోలేదని అనుకుని అటువైపు రారు కానీ, ఈ తలనొప్పి ప్రక్రియలన్నీ యెందుకు, వీటికి కాలం చెల్లింది,ఇంక వదిలెయ్యండి అంటూ ఉపన్యాసాలు చెయ్యరు. ఇంక చేసేవారెవరు? ఆ కళ గురించి తెలిసిన వారు. భాషాపరిశ్రమ చేసిన వారు. పద్యకవిత్వం గురించి వివరంగా తెలిసిన వారు. కొంతమంది వచనకవితలో చెయ్యి తిరిగిన వారు. అయితే అలా ఎందుకు చేస్తున్నారంటే రకరకాల సమాధానాలను ఊహించుకోవచ్చు గానీ మనం ప్రస్తుతం ఆ చర్చలోకి వెళ్ళవద్దు. ఒక తరహా రచయిత లేదా కవి వేరొక తరహా రచయితని గానీ కవిని గానీ సమభావంతో చూసి అపోహలు లేకుండా అర్థం చేసుకుంటే రెండు ప్రక్రియలూ సుసంపన్నమౌతాయి .స్టేజి మీద కూర్చున్న ఇద్దరూ ప్రేక్షకులకి ఇది కావాలి అంటే ఇది కావాలి అని వాదించుకోవడం సమంజసం కాదు. ప్రేక్షకులకి రెండూ కావాలి.

అష్టావధానశతావధానాలకీ, పద్యనాటికలకూ, కవిసమ్మేళనాలకూ లభించే ఆదరణ చూస్తుంటే అసలు పద్యకవిత ఎందుకు వెనక పడిందో, ఎన్నో పత్రికలు పద్యకవితలని ఇంతకాలం యెందుకు ప్రోత్సహించలేదో కొంచెం ఆలోచించవలసిన విషయమే అనిపిస్తుంది. దైనందిన వ్యవహారాలతో ఊపిరి సలపక భాషాపరిశ్రమ చేసేందుకు ఎవరికీ తీరిక లేక ఇంతకాలం పద్యం వెనకపడి ఉండవచ్చు. కానీ ఆ పరిస్థితి అలాగే కొనసాగవలసిన అవసరం లేదు. అన్ని రంగాల్లో లాగే ప్రజల భాషాభిరుచిలో కూడా ఒడుదుడుకులూ ఎత్తుపల్లాలూ ఉండవచ్చు. వాటినిబట్టి

కొన్ని సాహితీప్రక్రియలూ, కళలూ వెనకపడవచ్చు. కొన్ని మళ్ళీ పునరుజ్జీవనం కావచ్చు. ఆ పునరుజ్జీవనానికి ప్రజల ప్రోత్సాహం కావాలి. ఏ కళ ఐనా ఎవరికీ నచ్చక, ఎక్కడా కనపడక పూర్తిగా నిర్జీవమైపోతే ఏ ప్రోత్సాహమూ పనిచెయ్యదు. మళ్ళీ మళ్ళీ స్పష్టంగా వినిపిస్తున్న తెలుగు పద్యానికి మాత్రం ఆ స్థితి యింత వరకూ రాలేదనీ, యికముందు కూడా వచ్చే సూచనలు లేవనీ స్పష్టంగా తెలుస్తోంది. ఎంత కాలంగానో మన సంస్కృతిలో భాగంగా నిలిచిన మన పద్యసాహిత్యాన్ని కాపాడవలసినది, ప్రోత్సహించవలసినది బదులు పద్యం కనుమరుగైపోవాలనే ఆకాంక్షతో కొందరైనా ఉండడం విచారకరం. పద్యం ఒక్కటే కాక పద్యంతో పాటు ఇతరత్రమైన భాషాభిరుచి కూడా అందరి లో పెంపొంది తెలుగులోని అన్ని సాహిత్యప్రక్రియలూ నూతనోత్సాహాన్ని పుంజుకోవాలని ఆశిద్దాము.



రచయిత

స్వస్థలం ఏలూరు. చదువు ఏలూరు, విశాఖపట్నం, బెంగుళూరులలో. మేరీలాండ్‌లో నివాసం. బయో ఇన్ఫర్మేటిక్స్ సైంటిస్టుగా ఉద్యోగం. ఎప్పుడన్నా కవితలు వ్రాయడం, ఇంకెప్పుడన్నా నాటికలలో నటించడం అభిరుచులు.